క్లుప్తంగా

11న పూలే జయంతి

కర్నూలు(సెంట్రల్): మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఏప్రిల్ 11వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం డీఆర్వో కార్యాలయంలో పూలే జయంతి వేడుకల నిర్వహణపై అధికారులు, బీసీ సంఘాల నాయకులతో చర్చించారు. పేద, బడుగు బలహీన వర్గాల నేత పూలే వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. సంక్షేమ భవన్ ఎదుట ఉన్న ఆయన విగ్రహం ఎదుట సభను ఏర్పాటు చేసి అక్కడే నివాళి అర్పించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సలహాలు, సూచలను బీసీ సంఘాల నేతల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

కర్నూలు(సెంట్రల్): హైర్ బస్సు కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. గురువారం హైర్ బస్సు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి సుబ్బయ్యగౌడ్‌లతో కలసి ఓనర్లను కలసి వేతనాలు పెంచాలని విన్నవించారు. కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. సంవత్సరంలో రెండు జతల బట్టలు, ఒక నెల బోనస్, పండుగ అడ్వాన్సులు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

యాప్‌లను నిషేధించాలి

కర్నూలు(సెంట్రల్): యువతను పెడధోరణి పట్టిస్తున్న డేటింగ్, అశ్లీలతను పెంచే విధంగా ఉన్న డేటింట్ లివింగ్ ఫ్రెండ్స్ యాప్‌లపై నిషేధం విధించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. గురవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు పెరగడానికి కూడా లోన్, డేటింట్‌యాప్‌లే కారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, జి.చంద్రశేఖర్, బాబయ్య, చంటి, శేషన్న, హుస్సేన్‌బాష పాల్గొన్నారు.

రైళ్లపై రాళ్లు విసిరితే కఠిన చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): రైళ్లపై రాళ్లు విసిరితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు సిటీ రైల్వే పోలీసు అధికారి వి.సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం స్థానిక సిటీ రైల్వే స్టేషన్‌తో పాటు కోట్ల హాల్ట్ స్టేషన్లలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో వందే భరత్ రైలును కర్నూలు మీదుగా నడిపేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో అనుమానిత యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైల్వే పోలీసు అధికారులు బి.స్వామి, ఎస్ఆర్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హుసేన్ బాషా హత్య అమానుషం

కర్నూలు(రాజ్‌విహార్): మసీదు స్థలం కోసం కౌతాళం మండలం హాల్వి గ్రామం మౌలా లిదొడ్డి మసీదు కమిటీ చైర్మన్ పింజరి హుసేన్ బాషాను దారుణంగా హత్య చేయడం అమానుషమని ఏపీ వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ మహమూద్ పీర్ గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. గతంలో మసీదు స్థలాలను ఆక్రమించుకొని ప్రశ్నించిన వారిని దాడులకు పాల్పడేవారని, ఇప్పుడు ప్రాణాలు తీసే స్థాయికి చేరడం ఘోరం అన్నారు. కోర్టు మసీదు కమిటీకి అనుకూలంగా తీర్పు ఇచ్చినా హత్య చేశారని, నిందితులను కఠినంగా శిక్షించి మరోచోట ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిక కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు అన్ని విధాలా ఆర్థిక, న్యాయ సహకారం అందించాలని డిమాండ్ చేశారు.

మోదీ పాలన ప్రపంచానికే మార్గదర్శకం

కర్నూలు కల్చరల్: దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వ పాలన ప్రపంచానికే మార్గదర్శకమని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. గురువారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ కార్యాలయం వద్ద జరిగాయి. టీజీ, పార్టీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమౌళి పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ 1952లో శ్యాంప్రసాద్ ముఖర్జీ స్థాపించిన జన సంఘ్ ఆ తర్వాత భారతీయ జనతా పార్టీగా మార్పు చెందిందన్నారు. బీజేపీ వెనక ఎన్నో త్యాగాల చరిత్ర ఉందన్నారు. బీజేపీ అంచలంచలుగా ఎదిగి ప్రస్తుతం దేశంలో సుభిక్ష పాలన అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు మురళి, హవిలన్‌బాబు, మాలతి, తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

కర్నూలు(రాజ్‌విహార్): తపాల శాఖ గత ఏడాది నిర్వహించిన ఢాయి అఖార్ జాతీయ స్థాయి లెటర్ రైటింగ్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులు అందజేశారు. కర్నూలు డివిజన్ నుంచి ఐదు వేల మంది ఈ పోటీలో పాల్గొనగా సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఎం.తరుణి మొదటి బహుమతి రూ.10వేలు, బి.సానాలి రెండో బహుమతి రూ.5వేలు గెలుపొందగా గురువారం స్థానిక హెడ్ పోస్టాఫీసులో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నూరుల్లా అందజేశారు.

మార్కెట్ రాబడికి పత్తి దెబ్బ

- భారీగా పడిపోయిన పత్తి దిగుబడులు, ధరలూ అంతంత మాత్రమే
- ఆదోని మార్కెట్ ఆదాయంపై తీవ్ర ప్రభావం
- 2022-23 మార్కెటింగ్ శాఖ లక్ష్యం రూ.30.52 కోట్లు
- వచ్చింది రూ.25.56 కోట్లు మాత్రమే



కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్): పత్తి దిగుబడులు తగ్గిపోవడం, అంతంతమాత్రం వచ్చిన దిగుబడులకు కూడా ధరలు లేకపోవడంతో జిల్లా మార్కెటింగ్ శాఖ ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపింది. పంట ఉత్పత్తులు పెరిగి, ధరలు ఆశాజనంగా ఉంటే మార్కెట్ కమిటీల ఆదాయం పెరుగుతుంది. జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట పత్తి. 2021-22లో జిల్లాలో పత్తి దిగుబడులు గణనీయంగా రావడంతోపాటు, ధరలు పతాక స్థాయికి అంటే క్వింటాలుకు రూ.13000కుపైగా చేరాయి. ఇందువల్ల మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని అధిగమించి ఆదాయం పొందింది. 2022-23లో జిల్లాలో పత్తి సాగు పెరిగినా వాతావరణంలో వచ్చిన మార్పులు, అధిక వర్షాల కారణంగా గతంలో ఎన్నడూ లేని విధంగా దిగుబడులు పడిపోయాయి. ధరలు కూడా రూ.8000లోపే ఉన్నాయి. దీంతో మార్కెటింగ్ శాఖ రాబడికి దెబ్బపడింది. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై ఒక్కశాతం ఫీజు ప్రకారం మార్కెటింగ్ శాఖ వ్యాపారుల నుంచి వసూలు చేస్తుంది. జిల్లాలో 7 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. 2022-23 సంవత్సరంలో ఈ మార్కెట్ కమిటీల ద్వారా రూ.30.52 కోట్లు ఆదాయం పొందే విధంగా మార్కెటింగ్ శాఖ లక్ష్యాలను ఇచ్చింది. అయితే పత్తి దిగుబడులతో పాటు ధరలు పడిపోవడం వల్ల ఆదోని మార్కెట్ కమిటీకి, ఉల్లికి ధరలు లేకపోవడం వల్ల కర్నూలు మార్కెట్ కమిటీ ఆదాయానికి గండిపడింది. ఇందువల్ల 2022-23లో రూ.25.56 కోట్లు మాత్రం ఆదాయం వచ్చింది. లక్ష్యంతో పోలిస్తే రూ.4.96 కోట్ల ఆదాయం పడిపోయింది. 2021-22లో రూ.28.62 కోట్లు ఆదాయం వచ్చింది. 2021-22తో పోలిస్తే 2022-23లో రూ.3.02 కోట్ల ఆదాయం తగ్గింది.

ఆదోని మార్కెట్‌కు తగ్గిన ఆదాయం...

గతంలో ఎపుడూ లేని విధంగా ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఆదాయం పడిపోయింది. 2021-22లో పత్తి ధరలు పతాకస్థాయికి చేరడం వల్ల ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి గణనీయమైన ఆదాయం లభించడం విశేషం. 2021-22లో ఆదోని మార్కెట్‌రూ.16.03 కోట్ల ఆదాయం లభించింది. 2022-23లో పత్తి దిగుబడులు, ధరలు పడిపోవడం కారణంగా రూ.12.48 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. అంటే రూ.3.55 కోట్ల ఆదాయం తగ్గింది.

గత ఏడాదితో పోలిస్తే మెరుగుపడిన కర్నూలు మార్కెట్ కమిటీ ఆదాయం...

కర్నూలు మార్కెట్ కమిటీ కూడా లక్ష్య సాధనలో వెనుకబడినప్పటికి 2021-22తో పోలిస్తే ఆదాయం భారీగా పెరగడం విశేషం. 2022-23లో ఒక్క శాతం ఫీజు ద్వారా రూ.6.15 కోట్లు ఆదాయం పొందాలనేది లక్ష్యం. అయితే రూ.5.61 కోట్లు వసూలు చేసినట్లు స్పష్టమవుతోంది. 2021-22లో కర్నూలు మార్కెట్ కమిటీకి రూ.4.53 కోట్లు మాత్రమే వచ్చింది. 2021-22తో పోలిస్తే 2022-23లో రూ.1.07 కోట్ల ఆదాయం పెరిగింది. మార్కెట్ కమిటీ తీసుకున్న ప్రత్యేక చొరువ వల్ల ఆదాయం పెరిగినట్లు స్పష్టమవుతోంది. కర్నూలు మార్కెట్‌కు ఉల్లి పోటెత్తుతుంది. అయితే ధరలు లేకపోవడం వల్ల లక్ష్యం మేరకు ఆదాయం పొందలేకపోయినట్లు సమాచారం. ఎమ్మిగనూరు, పత్తికొండ వ్యవసాయ మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని పొందాయి. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.3.80 కోట్లు ఉండగా..రూ.3.89 కోట్లు సాధించడం విశేషం. పత్తికొండ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.62 లక్షలు ఉండగా...రూ.66.96 లక్షలు సాధించింది. కోడుమూరు, ఆలూరు, మంత్రాలయం మార్కెట్ కమిటీలు లక్ష్యసాధనలో వెనుకబడ్డాయి.

సమష్టి కృషి ఫలితంగా ఆదాయం పెరిగింది



మార్కెట్ కమిటీ పాలక వర్గం చొరవ, సిబ్బంది సమష్టి కృషి వల్ల 2021-22తో పోలిస్తే కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం పెరిగింది. కర్నూలు మార్కెట్‌లో మిర్చి, వేరుశనగ ధరలు ఆశాజనకంగా ఉండటం వల్ల మార్కెట్‌కు ఆదాయం పెరిగింది. 2021-22లో మార్కెట్ కమిటీకి రూ.4.53 కోట్ల ఆదాయం వచ్చింది. 2022-23లో రూ.5.61 కోట్ల ఆదాయం వచ్చింది. మార్కెట్ కమిటీ ఆదాయం లీక్ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాము. 2023-24లో లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని పెంచేందుకు ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకుంటున్నాము.

–గోవిందు, ఎంపిక శ్రేణి సెక్రటరీ, మార్కెట్ కమిటీ కర్నూలు

మాజీ సైనికులకు తీవ్ర అన్యాయం

కర్నూలు(అర్బన్): డీఆర్ఆర్ఎల్‌లో పనిచేస్తున్న మాజీ సైనికులను ఉద్యోగాల నుంచి తొలగించి తీవ్ర అన్యాయం చేశారని జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య, కోశాధికారి నజీర్‌అహమ్మద్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ కంపెనీల్లో 80 మంది సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారని, ఇందులో 70 మంది మాజీ సైనికులు కాగా, 10 మంది ఇతరులు ఉన్నారన్నారు. వీరిలో ఎలాంటి తప్పు చేయకున్నా 20 మంది మాజీ సైనికులను తొలగించారన్నారు. ఈ విషయాన్ని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కలెక్టర్ పీ కోటేశ్వరరావు దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. అలాగే మాజీ సైనికులకు జరిగిన అన్యాయంపై జిల్లా సైనిక్‌బోర్డు, డైరెక్టర్, డీజీఆర్‌కు లేఖలు పంపామన్నారు. ఉద్యోగాలు కోల్పోయిన మాజీ సైనికుల కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తిరిగి వారికి ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

జగనన్నది పేదల ప్రభుత్వం





మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, సమావేశంలో పాల్గొన్న వార్డు కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు

- 7 నుంచి ఇంటింటికీ వెళ్దాం
- ప్రజలకు చేసిన మంచిని, పథకాల వల్ల చేకూరిన లబ్ధిని వివరిద్దాం
- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొడదాం
- వార్డు కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది పేదల ప్రభుత్వమని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక ఆయన కార్యాలయంలో వార్డు కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'జగనన్నే మా మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు. గత తెలుగు దేశం ప్రభుత్వం పథకాలు అమలు చేసేందుకు సిఫార్సులకే అధిక ప్రాధాన్యత ఇచ్చింద చెప్పారు. అర్హులైన వారికి కాకుండా జన్మభూమి కమిటీల చేతులు తడిపిన వారికే పథకాలిచ్చిందని, కానీ తమ ప్రభుత్వం సిఫార్సులు, కమీషన్లకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా మంజూరు చేస్తోందన్నారు. పేదలకు చేసిన మంచి, లబ్ధి చేకూర్చిన పథకాలను వివరించేందుకు ఈ నెల 7వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్దామన్నారు. ఏ పథకమైనా కుల మతాలు, రాజకీయాలు చూడకుండా అమలు చేసిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానికే దక్కిందని వివరించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పథకాల కోసం ప్రజలు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారని, వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ సేవలందిస్తున్నారన్నారు. వీటిపై వార్డు కన్వీనర్లు, గృహ సారథులు విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే తమ అధినేత సీఎం జగన్ అమలు చేస్తున్న పింఛన్లు, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, నాడు -నేడు, విద్యా దీవెన, వసతి దీవెన, ఆరోగ్య శ్రీ, పేదలకు ఇళ్లు, ఆసరా, చేయూత, వాహన మిత్ర ఇలా నవరత్నాల పథకాలను వివరించాలన్నారు. సర్వే చేసి వారి అభిప్రాయాలు స్వీకరించి మరింత మెరుగైన పాలన అందించేందుకు కృషి చేద్దామన్నారు. జగనన్న ప్రభుత్వంపై టీడీపీ, జనసేన చేసే తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతామని, ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నగర అధ్యక్షురాలు సిత్ర సత్యనారాయణమ్మ, పార్టీ నాయకులు మద్దయ్య, అనిల్‌కుమార్, పార్టీ కార్పొరేటర్లు, వార్డు కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్, బజరంగ దల్ సంయుక్తంగా గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకొని బలోపాసన దివస్ పేరుతో వీర హనుమాన్ విజయ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పాల్గొని భక్తులకు కోల్స్ కాలేజ్, బుధవారపేట ప్రాంతాల్లో మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఎమ్మెల్యే దర్బార్ నిర్వహించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చెప్పారు. సమస్యలు ఎదురైనప్పుడు సచివాలయాల్లో చెప్పుకుంటే పరిష్కారమవుతాయని, అక్కడ స్పందించని పక్షంలో నేరుగా తనను కలసి చెప్పుకోవచ్చన్నారు.

ఏపీఎస్పీ పటాలంలో మౌలిక వసతులు కల్పించండి

- మేయర్‌కు కమాండెంట్ విజ్ఞప్తి



మేయర్ బీవై రామయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న కమాండెంట్ రవిశంకర్

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండవ పటాలంలో సిబ్బంది నివాసముంటున్న క్వాటర్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని మేయర్ బీవై రామయ్యకు కమాండెంట్ పి.రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం(కర్నూలు రెండవ పటాలం) అధ్యక్షులు వై.పెద్దన్న, కార్యదర్శి హరిచంద్రుడు ఆహ్వానం మేరకు గురువారం మధ్యాహ్నం మేయర్ బీవై రామయ్య పటాలంలో పర్యటించారు.పటాలంలో సుమారు 1200 క్వాటర్స్ ఉండగా అందులో వెయ్యికి పైగా శిథిలావస్థలో ఉన్నాయి. కేవలం 200 కుటుంబాలు మాత్రమే క్వాటర్స్‌లో నివాసముంటున్నారు. అయితే శిథిలావస్థలో ఉన్న క్వాటర్స్‌కు కూడా నీటి పన్ను (కొళాయి పన్ను) వస్తుండటంతో సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. అలాగే దశాబ్దం క్రితం వేసిన అంతర్గత రోడ్లు, మురికి కాలువలు పూర్తి శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో క్వాటర్స్ నుంచి మురుగునీరు బయటకు వెళ్లకుండా ఎక్కడికక్కడే నిలిచిపోతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. మురికి కాలువలతో పాటు అంతర్గత రోడ్లు వేయించాలని కమాండెంట్ మేయర్‌కు విన్నవించారు. పటాలంలో మౌలిక వసతుల కల్పన కోసం చర్యలు తీసుకుంటామని మేయర్ సానుకూలంగా స్పందించారు. అంచనా వ్యయం ఎంత అవుతుందో చూడాలని అధికారులకు సూచించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.ఎం.బాషా, మున్సిపల్ కార్పొరేషన్ డీఈ రాజశేఖర్, ఏఈ దినేష్ తదితరులు కూడా మేయర్ వెంట ఏపీఎస్పీ బెటాలియన్‌లో పర్యటించారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని సి.క్యాంప్ సెంటర్‌లోని మామూర్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. గురువారం రాత్రి మసీదు పెద్దలతో కలసి దువా చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్ద ఖాదర్ ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సయ్యద్ ఆసిఫ్, జహీర్ ఖాన్, రియాజ్ బాబా, ఖాజా హుసేన్ పాల్గొన్నారు.

15న మార్కెట్ దుకాణాలకు వేలంపాట

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు నూతనంగా నిర్మించిన 15 దుకాణాలకు ఈ నెల 15న మార్కెటింగ్ శాఖ జేడీ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తెలిపారు. మార్కెట్ కమిటీ నిధులతో మార్కెట్ కమిటీ బయట పంప్‌హౌస్ రోడ్డులో ఒక చోట 7, మరో చోట 8 దుకాణాలతో వాణిజ్య సముదాయాలను నిర్మించినట్లు తెలిపారు. వీటిని వేలంపాట ద్వారా కేటాయిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు మార్కెట్ కమిటీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి



అన్న ప్రసాదం వడ్డిస్తున్న మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ కుమ్మరి వీధిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అర్చన, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎస్వీ విజయమనోహరి దంపతులు పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ కార్పొరేటర్ నాగయ్య యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీతోనే బీసీలకు గుర్తింపు



మాట్లాడుతున్న నాగరాజు

కర్నూలు(రాజ్‌విహార్): అణగారిన బీసీలకు అన్ని రంగాల్లో గుర్తింపు కల్పించిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా బీసీ విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జి.నాగరాజు అన్నారు. గురువారం ఆయన స్థానిక భాగ్యనగర్‌లోని తన కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన బీసీ కులాలకు అనేక పదవులు ఇచ్చి రాజకీయంగా గుర్తింపు కల్పించిన ఏకైన పార్టీ తమదే అన్నారు. 56 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమించిందని, వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం బీసీలకు చేసిన మేలును వివరించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు సోమశేఖర్, ప్రసాద్, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ ఆచారి, నాయకులు లక్ష్మీకాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలేజీలపై చర్యలు తీసుకోండి

కర్నూలు సిటీ: ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు కనీసం వారం రోజులు కూడా వేసవి సెలవులు ఇవ్వకుండా కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నాయని, ఇంటర్ బోర్డు ఆదేశాలను పట్టించుకోని అలాంటి కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టికి వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, నగర అధ్యక్షులు అమర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత నృత్య కళాశాలలో ఉద్యోగాల నియామకాలు

కర్నూలు కల్చరల్: శారదా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో పలు కోర్సులకు సంబంధించి ఫ్యాకల్టీ నియామకం జరిగింది. ఆరు కోర్సులకు కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వహించేందుకు ఇప్పటికే ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన ఉద్యోగులకు పోస్టింగ్ ఇచ్చారు. వారు ఈ నెల 10వ తేదీన విధుల్లో చేరనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ తెలిపారు. ఓకల్ (గాత్రం) కోర్సుకు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన భరద్వాజ్, రాజమండ్రికి చెందిన శ్రీకిరణ్, గాయక్ అసిస్టెంట్ కోర్సుకు కృష్ణా జిల్లాకు చెందిన వాగ్దేవ్ ప్రసాద్, డోలు కోర్సుకు నెల్లూరు జిల్లాకు చెందిన మల్లికార్జున, మృదంగం కోర్సుకు కర్నూలు జిల్లాకు చెందిన సుధాకర్‌లు ఎంపికయ్యారన్నారు. వీణ కోర్సుకు ఎంపికైన వారి ఫలితాలు వెల్లడి కావాల్సి ఉందని తెలిపారు. అన్ని కోర్సులకు పూర్తి స్థాయిలో నిపుణులైన ఫ్యాకల్టీ ఉండటంతో సంగీతం, నృత్యం, గాత్రం, డోలు, మృదం నేర్చుకోవాలనుకునే వారు ప్రవేశాలు పొందవచ్చని సూచించారు.